# శ్రీమదాంధ్ర మహాభారతం - సరళవచనం

భాగం - 3

తిక్కన సోమయాజి రచనకు సంక్షిప్త రూపం

## విరాట, ఉద్యోగ పర్వములు



- పుత్సా కృష్ణ కామేశ్వర్

# శ్రీమదాంధ్ర మహాభారతం - సరళ వచనం

తిక్కన సోమయాజి రచనకు సంక్షిప్త రూపం
(విరాట, ఉద్యోగపర్వములు)


ముద్రణ : జూన్, 2018

మూల్యము : రూ. 180.00



రచయిత : పుత్సా కృష్ణ కామేశ్వర్ ఎ. ఎమ్. ఐ. ఇ.
భూపయ్య అగ్రహారం, అమలాపురం
ఫోన్ : 8341545251, 9492384665



డి. టి. పి : కొంపెల్ల వెంకట సుబ్రహ్మణ్యం (సురేష్),
హిందీ పండిట్, ఎ. వేమవరం.
ఫోన్: 9493785860

ముద్రణ : శ్రీ చక్ర ఆఫ్‌సెట్ ప్రింటర్స్
తాటిపాక
ఫోన్ : 9866952350

ప్రతులకు : కె. ఎస్. పబ్లిషర్స్,
'గాయత్రి నిలయం'
డోర్. నెం. 4 - 2 - 89ఎ,
భూపయ్య అగ్రహారం, అమలాపురం
ఫోన్ : 08856 - 234665

# విషయసూచిక


## విరాటపర్వము

ధౌమ్యుడు చెప్పిన సేవాధర్మాలు ......... 8
పాండవులు విరాట నగరం బయలుదేరుట ........ 9
పాండవులు విరాట మహారాజు కొలువులో చేరుట ...... 13
భీముడు మల్లునితో యుద్ధం చేయుట ........ 21
కీచకుడు ద్రౌపదిని మోహించుట ........ 22
ద్రౌపది మదిర కోసం కీచకుని ఇంటికి వెళ్ళుట....... 26
కీచకుడి మరణం ........ 32
ఉపకీచకుల మరణం ........ 36
దక్షిణ గోగ్రహణం ........ 42
ఉత్తర గోగ్రహణం ........ 46
ఉత్తరుడు బృహన్నలను తనకు సారథిగా చేసికొనుట.... 48
అర్జునుడు కౌరవసైన్యంతో యుద్ధం చేయుట ........ 67
కర్ణార్జునుల ద్వంద్వ యుద్ధం ........ 70
అర్జునుడు ద్రోణుడితో యుద్ధం చేయుట ........ 72
అర్జునుడు అశ్వత్థామతో యుద్ధం చేయుట ........ 73
అర్జునుడు కృపుడితో యుద్ధం చేయుట ........ 73
అర్జునుడురారాజుతో యుద్ధం చేయుట ........ 76
ఉత్తర అభిమన్యుల వివాహం ........ 90

## ఉద్యోగపర్వము ........ 93

అర్జున దుర్యోధనులు కృష్ణుడు సాయం కోరుట........ 98
వృత్రాసుర సంహారం ........ 103
నహుషుడు ఇంద్రపదవిని స్వీకరించుట ........ 104
ద్రుపద పురోహితుడి రాయబారం ........ 110
సంజయ రాయబారం ........ 113
విదురుడి హితోపదేశం ........ 125
శ్రీకృష్ణుడి రాయబారం ........ 143
శ్రీకృష్ణుడితో ద్రౌపది సంధివాక్యాలు ........ 150

శ్రీకృష్ణుడు హస్తినకు ప్రయాణమగుట ........ 153
శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునితో సంభాషించుట. ........ 163
దుర్యోధనుడికి మహర్షుల బోధ ........ 166
కృష్ణుడిని బంధించాలని యత్నించుట ........ 173
కుంతీదేవి కర్ణుడిని కలుసుకొనుట ........ 179
ద్రోణాదులను సేనాపతులుగా నియమించుట ........ 184
బలరాముడు తీర్థయాత్రలకు వెళ్ళుట ........ 185
రుక్మి వృత్తాంతం ........ 186
శిఖండి వృత్తాంతం ........ 190
భీష్ముడు పరశురాముడితో యుద్ధం చేయుట. ........ 193

## పద్యములు

1. సింగం బాఁకటితో ........ 52
2. మోహనబాణపాతమున ........ 79
3. వివిధోపాయ ........ 111
4. పెట్టనికోట నీకు హరి ........ 116
5. గాండీవ జ్యారవం బుత్కట ........ 117
6. పాలీక కౌరవులు ........ 118
7. రోషమయ మహాతరువు ........ 121
8. ధర్మజుండు ధర్మతరు ........ 121
9. నెట్టన యిట్టియల్క ........ 152
10. అందు వృకోదరార్జునుల ........ 164
11. సారపు ధర్మమున్ ........ 165
12. మునులార! నన్నువిధి ........ 168
13. కౌరవనాయక! పాండుకుమారులు ........ 169
14. అరయం దప్పొకయింత ........ 170
15. ఏమును వారుఁబంచికొని ........ 171
16. అలవ యెఱుంగకిట్లు ........ 174
17. అనుజులు ఋత్విజులుగ ........ 178
18. అనుమానం బదియేల ........ 199

# శ్రీమదాంధ్ర మహాభారతం - సరళ వచనం

## విరాటపర్వము

పాండవులు వనవాసాన్ని ముగించిన విధానాన్ని తెలుసుకొన్న జనమేజయుడు వైశంపాయనుడితో "మహానుభావా! అభిమానధనులూ, ప్రజల చేత నిత్యం గౌరవింపబడేవారూ, ప్రకాశవంతమైన ఆకారాలు కలిగిన మా తాతలు, ద్రౌపదితో కలిసి శత్రువులకు పట్టుబడకుండా అజ్ఞాతవాసాన్ని ఏ విధంగా పూర్తి చేశారో వివరంగా తెలుపండి'' అని అడిగాడు.

జనమేజయుని ఆసక్తిని గమనించిన వైశంపాయనుడు "మహారాజా! పాండవులు అరణ్యవాసం చివరలో ఉండగా యమధర్మరాజు యక్షుడి రూపంలో వారి వద్దకు వచ్చాడు. తాను అడిగిన ప్రశ్నలకు ధర్మరాజు ఇచ్చిన సమాధానాలకు సంతోషించినవాడై అతడు పాండవులకు "అజ్ఞాతవాసంలో మీకు ఎట్టి ఇబ్బందులూ రావు'' అని వరాన్నిచ్చాడు. ఆ తరువాత పాండవులు అంతవరకూ తమతోపాటు అరణ్యాలలోనే కాలం గడుపుతున్న బ్రాహ్మణుల వద్దకు వెళ్ళి, వారితో "ఓ బ్రాహ్మణోత్తములారా! మా మీద అభిమానంతో మీరు ఇంతకాలం మాతోపాటుగా ఈ అరణ్యాలలో చాలా కష్టాలు అనుభవించారు. మీరు తోడుగా ఉండగా మేము ఈ పన్నెండు సంవత్సరాల అరణ్యవాస కాలాన్ని ఏదో విధంగా పూర్తిచేశాం. ఇక ఈ పదమూడవ సంవత్సరంలో మేము అజ్ఞాతవాసాన్ని పూర్తి చేయవలసి ఉంది. దుర్యోధనుడు, దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని మొదలైనవారు మా ఈ అజ్ఞాతవాసాన్ని చెడగొట్టడానికి ప్రయత్నిస్తారు. కనుక వారికి దొరకకుండా మేము అజ్ఞాత వాసాన్ని పూర్తిచేసేలా మమ్మల్ని ఆశీర్వదించండి'' అని వారిని కోరారు.

పిదప ధర్మరాజు విచార వదనంతో "బ్రాహ్మణులారా! మేము ఈ ఆపదల నుండి గట్టెక్కి, ఏనాటికైనా సుఖంగా జీవితాన్ని గడుపుతామా? అసలు ఇటువంటి కష్టాలను వేరెవ్వరైనా ఇంతకుముందు పొందారా?'' అని అడిగాడు.

ధర్మరాజు పరిస్థితిని గమనించిన బ్రాహ్మణులూ, అతని తమ్ముళ్ళూ ధర్మరాజును ఓదార్చారు. అప్పుడు ధౌమ్యుడు ధర్మరాజు విచారాన్ని పోగొట్టదలచి, అతనితో "లోకంలో ధర్మాధర్మాలను నిర్ణయించడంలో మేటి అని పేరుపొందిన నువ్వు ఈవిధంగా దుఃఖించడం తగదు. సమర్థులైన దేవతలే విరోధులను సంహరించే కాలంలో, వారికి కాలం కలసి వచ్చేంత వరకు తమ సామర్థ్యాన్ని బయటపెట్టకుండా అణగి ఉన్నారు. ఇంద్రుడు తన నిజస్వరూపం ఇతరులకు తెలియకుండా నిషధపర్వతం మీద కాలం గడిపాడు. సాక్షాత్తూ విష్ణుమూర్తే అదితి గర్భంలో వామన రూపంలో అణగి ఉన్నాడు. ఔర్వుడు తన తల్లి తొడలోపల నూరు సంవత్సరాలు రహస్యంగా దాగి ఉన్నాడు. సూర్యుడు ఆవు శరీరంలో విలీనమయి అజ్ఞాతవాసం చేశాడు. వీరంతా ఎంతో సమర్థులైనప్పటికీ కష్టాలను అనుభవించారు. కాలం కలిసి వచ్చిన తరువాత వారు తమ శత్రువులను జయించారు. కనుక ఓ ధర్మరాజా! నువ్వు కూడా ఇబ్బందులను ఓర్చుకొని, తరువాత ప్రతీకారం తీర్చుకొందువుగాని" అని అన్నాడు. ధౌమ్యుడి ఆ మాటలకు ధర్మరాజు మనస్తాపం ఉపశమించింది.

పిమ్మట బ్రాహ్మణులందరూ పాండవులకు కార్యసిద్ధి కలగాలని దీవించి, "మరల మీ దర్శనం కలుగుగాక!" అని వారిని ఆశీర్వదించి, తమ తమ ప్రదేశాలకు వెళ్ళిపోయారు. పాండవుల వెంట అరణ్యవాసం చేసిన పరివారజనం కూడా, వారి వద్ద సెలవు తీసుకొని తమకు అనుకూలమైన ప్రదేశాలకు వెళ్ళారు. పాండవులు, ధౌమ్యుడు, ద్రౌపది, ఆ రాత్రి వారికి తగిన స్థలంలో సుఖంగా కాలం గడిపారు.

మరునాటి ఉదయం ధర్మరాజు అర్జునుడితో "మనం అయిదుగురం, ద్రౌపదితో కలిసికట్టుగా ఎక్కడికి వెళ్ళినా జనులు మనలను గుర్తిస్తారు. మరి ఈ అజ్ఞాతవాసాన్ని గడిపే ఉపాయమేది?" అని అడిగాడు. దానికి అర్జునుడు తన అన్నగారితో, "అరణ్యవాస సమయంలో నీ సత్ప్రవర్తనకు మెచ్చి యమధర్మరాజు ఇచ్చిన వరం ఉండగా మనం ఎక్కడ ఏ విధంగా నడచుకొన్నా, ఇతరులు మనల్ని గుర్తించలేరు. కనుక నిశ్చింతగా ఉండండి. కురుదేశం చుట్టూ పాంచాల, మత్స్య, చేది, సాళ్వ, విదేహ, బాహ్లిక, దశార్ణ, శూరసేన,

## పాండవులు విరాట మహారాజు కొలువులో చేరుట :

ఆనాడు విరాట మహారాజు ప్రజల మధ్య కొలువు తీరి ఉన్నాడు. ధర్మరాజు అతడి ఆస్థానాన్ని సమీపిస్తుండగా, విరాటుడు దూరం నుంచి ధర్మరాజు వైపు చూసి, "ఈ వచ్చేవ్యక్తి నా చూపులకు మిక్కలి అబ్బురంగా కనిపిస్తున్నాడు. ఇతడు లోకాలన్నీ పరిపాలించే తేజంతో, త్రిమూర్తులతో సమానమైన రూపంతో సన్న్యాసులలో శ్రేష్ఠుడిలా ఉన్నాడు. చూశారా! ఇతడు బహుశా రాజై ఉండవచ్చు. అంతేకాదు పట్టాభిషేకం పొందిన రాజులు సైతం తన పాదాలను సేవించే చక్రవర్తి పదవికి తగిన వాడులా ఉన్నాడు. ఇతడు నా వద్దకు ఎందుకు వస్తున్నాడో? ఒకవేళ ఈ మహాత్ముడు నా నుండి ధనాన్నిగాని, వస్త్రాలనుగాని, మణులనుగాని కోరి వస్తే అతడు అడిగిన దానికంటె అధికంగా ఇచ్చి గౌరవిస్తాను. కాదూ అతడు మత్స్యరాజ్య వైభవానికి తగినవాడని భావిస్తే అతడినే రాజుని చేసి, నేను నా మంత్రులూ, కుమారులూ, భటులూ, పురజనులతో కలిసి అతడిని సేవిస్తాను" అని సభాసదులతో అన్నాడు.

కంకుభట్టు ఆస్థానంలోకి ప్రవేశించగానే, సభాసదులందరూ భక్తితో లేచి నిలుచున్నారు. మహారాజు విరాటుడు కూడా సింహాసనం దిగి, ఆయనకు ఎదురేగి, భక్తితో నమస్కరించాడు. కంకుభట్టును సమున్నతమైన ఆసనం మీద సుఖాసీనుడిని చేసి, విరాటుడు వినయంగా, "అయ్యా! మీ జన్మస్థలం ఏది? కులమేది? మీ నివాసస్థలమేది? మీ పేరేమిటి? ఇక్కడకు ఏ కారణం చేత వచ్చారు?" అని అడిగాడు. దానికి కంకుభట్టు "మహారాజా! వాస్తవాన్ని మాట్లాడే మనుష్యులు ఎక్కడ ఉన్నారు? ఎవరికి తోచిన విధంగా వారు మాట్లాడే తీరే ఎక్కడ చూసినా కనపడుతోంది" అని విరాటరాజు వైపు చూసి మందహాసం చేసి, "రాజా! నేను ద్విజుడిని. కురుదేశంలో జన్మించాను. ధర్మరాజుకు సఖుడిని. ఇప్పుడు సన్న్యాసాశ్రమంలో ఉన్నవాడిని. రాజులకు తగిన ఎన్నో వినోదాలను చేయగలవాడిని. జూదం నేర్చిన వాడిని. గిట్టనివాళ్ళు మోసంచేసి, నా చేతిలోని డబ్బంతా లాక్కొని నన్ను అవమానపరచారు. అందువల్ల వైరాగ్యం కలిగి అక్కడి నుండి బయటపడ్డాను.

నాకు రాజనీతి విద్యలో చాతుర్యం ఉంది. నేను ధార్మికుల స్నేహంలో ఆసక్తి ఉన్నవాడిని. నా పేరు కంకుడు. నీచమైన కొలువులో నాకు ఉండబుద్ధి కాదు. నువ్వు సాధుజన మిత్రుడవని విని నిన్ను కొలవడానికి వచ్చాను. ఒక సంవత్సరకాలంలో పూర్తి చేయవలసిన వ్రతమొకటి నాకున్నది. దానిని నీ దగ్గర పూర్తి చేసి, నీ పట్ల కృతజ్ఞత తెలుపుకొంటాను. తరువాత నాకు కీడు చేసిన వారిని జయించడానికి వెళ్తాను'' అని చెప్పగా, విరాటుడు సంతోషించి, “అలాగే మీరు నా ఆస్థానంలో ఉండండి. ఇక్కడ నాకు ఏ విధంగా మర్యాదలు జరుగుతాయో, మీకు కూడా అటువంటి మర్యాదలే జరుగుతాయి. ఒకవేళ మీకు మత్స్యదేశానికి రాజుగా ఉండి పాలించటం ఇష్టమైతే, నేను సపరివారంగా మిమ్మల్ని కొలుస్తాను. నాకు అటువంటి అవకాశాన్ని కల్పించండి'' అని వినయంగా కోరాడు.

విరాట మహారాజు మాటలకు కంకుభట్టు నవ్వి, “రాజా! నేను హోమం చేయడానికి అర్హమైన పదార్థాలనే భుజిస్తాను, నేలమీదే నిద్రిస్తాను. వ్రతాచరణలో ఉన్న నాకు రాజార్హమైన మర్యాదలు కావాలా?'' అని ప్రశ్నించాడు. దానికి మహారాజు, “అయ్యా! మీకు ఏ విధంగా ఉండాలని ఉంటే, ఆ విధంగానే ఇక్కడ ఉండండి. అదే మాకు కూడా సంతోషదాయకం'' అని బదులిచ్చాడు. విరాటుడు మాటిమాటికీ ప్రియం రెట్టింపు కాగా ధర్మరాజును అపూర్వంగా చూడసాగాడు. విరాటుడూ, అతని పరివారమూ కంకుభట్టును గౌరవించటంలో ఆసక్తులయ్యారు.

కొంతసేపటి తరువాత ధర్మరాజు వచ్చిన వైపునుండి కాక మరో దిక్కు నుండి భీముడు వంటలవాడిలా వేషం ధరించి, కుడి చేతిలో గరిటె, ఎడమ చేతిలో శూలాలు పట్టి, లేడి చర్మాన్ని ఉత్తరీయంగా ధరించి, మదించిన గజరాజు నడకవంటి నడకతో విరాటుడి ఆస్థానాన్ని చేరాడు. అల్లంత దూరాన్నుండి భీముడిని చూసిన విరాటుడు మనస్సులో భయాన్నీ, ఆశ్చర్యాన్నీ పొందాడు. భీముడి పొడుగాటి చేతులూ, విశాలమైన వక్షఃస్థలమూ తన్మయత్వాన్ని కూడా కలిగించాయి. అతడు తన మనస్సులో, “ఈ వచ్చేవాడు మానవాకారంలో భూమి మీదకు వచ్చిన సూర్యుడో, చంద్రుడో లేక ఇంద్రుడో?'' అని భావించాడు.

## ఉత్తర గోగ్రహణం:

జనమేజయుడు వైశంపాయనుడిని, "కౌరవులు మత్స్యదేశపు గోసంపదపై ఏవిధంగా దాడి చేశార"ని ప్రశ్నించాడు. అప్పుడు వైశంపాయనుడు ఈ విధంగా చెప్పసాగాడు, "భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు మొదలైన వీరులు గల దుర్యోధనుడిసేన మత్స్యదేశంవైపు సాగి, విరాటరాజు యొక్క ఆవుల మందలను పట్టుకొన్నది. అక్కడ ఆవుల మందలకు కాపలాగా ఉన్న కొద్దిపాటి సైన్యం పోరాటం జరిపినప్పటికీ, కౌరవసైన్యం ముందు నిలువలేకపోయింది. గోవుల పెద్ద ఆ సైన్యాన్ని కౌరవసైన్యంగా గుర్తించి, వెంటనే ఒక రథంపై నగరానికి చేరి రాజమందిరం ముందు నిలిచాడు. అక్కడ అంతఃపురంలో ఉన్న ఉత్తరుడిని చూసి, అతడు నమస్కరించాడు. తరువాత ఆవులమందపై కురుసైన్యం చేసిన దాడిని గురించి చెప్పి, తమను కాపాడవలసిందిగా అర్థించాడు. అంతేగాక అతడితో, "రాజా! నీ తండ్రి ఎప్పుడూ నీ భుజబలం గురించీ, పరాక్రమం గురించీ, నీ సమర్థత గురించీ గొప్పగా చెప్తుండేవాడు. దానినిప్పుడు నిరూపించుకొనే సమయం నీకు వచ్చింది" అని గుర్తు చేశాడు.

గోపాలకుల పెద్ద, తనను ఆవిధంగా పొగిడేసరికి ఉత్తరుడిలో ఉత్సాహం కలిగింది. ఆ సమరోత్సాహంతో అతడు, "చిటికెలో కౌరవులను ఎదిరించి, క్షణాలలో ఆవులను మళ్ళిస్తాను. అయితే తగిన రథసారథి లేడనే ఆలోచిస్తున్నాను" అని చెప్పి, "నాకు తగిన సారథి ఎక్కడైనా దొరుకుతాడేమో నగరంలో చూడండి. నేను యుద్ధంలో వీరులను ఎదుర్కోవడం చూసి, కౌరవులు నన్ను అర్జునుడే అని భ్రమించేలా చేసి, వారినందరినీ జయించి, గోవుల మందలను మళ్ళిస్తాను" అన్నాడు.

ఉత్తరుడు తనను అర్జునుడితో పోల్చుకోవడం విని, అక్కడే ఉన్న ద్రౌపది నవ్వుకొంది. అర్జునుడి వద్దకు వెళ్ళి ఆ విషయం చెప్పింది. అప్పుడు అర్జునుడు తమ అజ్ఞాతవాసం గడువు తీరిపోయిందన్న విషయాన్ని ద్రౌపదికి తెలియజేసి, ఆమెతో, "నువ్వు బృహన్నల రథసారథ్యం చేయగలడనీ, అతడు ఇంతకు ముందు ఖాండవవన దహన సమయంలో అర్జునుడికి సారథిగా ఉన్నాడనీ, అతడి సహకారంతో కురుసైన్యాన్ని గెలువవచ్చునీ వారికి తెలియజెయ్యి. వారి

అనుమానాలను తగిన రీతిలో నివృత్తి చేసి, ఏ విధంగానైనా వారు నన్ను పిలిచేటట్లుగా చెయ్యి'' అని చెప్పాడు. ద్రౌపది సరేయని అంగీకరించి, ఉత్తర దగ్గరకు వెళ్ళి ఆమెతో, "ఉత్తరా! నీ సోదరుడు తనకు తగిన సారథి కోసం వెదకుతున్నాడు. ఈ సందర్భంలో నాకు తెలిసిన విషయాన్ని నీకు చెప్తున్నాను. నీ గురువైన బృహన్నల ఇంతకుముందు అర్జునుడు ఖాండవవనాన్ని దహించే సందర్భంలో అతడికి సారథ్యం వహించాడు. ఇతడి బాహుబలం, ఉపాయాలు అర్జునుడికి ఎంతో ఉపకరించాయి. కనుక ఈ విషయాన్ని ఉత్తరుడికి చెప్పుదాము'' అని చెప్పింది.

ఉత్తర వెంటనే సైరంధ్రిని వెంటబెట్టుకొని తన అన్న ఉత్తరుడి వద్దకు వెళ్ళి బృహన్నల యొక్క సమర్థతను గురించి తెలిపింది. వారి మాటలకు ఉత్తరుడు చిరునవ్వు నవ్వి సైరంధ్రితో, "సైరంధ్రీ! నన్ను ఎందుకు ఈ విధంగా హేళన చేస్తావు? పేడిని చూడటానికే ఏవగించుకొనే నేను, అతడి సారథ్యంలో కురుబలాన్ని ఎదుర్కొనడమా? నగరంలో సారథులే కరువయ్యారా!'' అని ప్రశ్నించాడు. అతడి మాటలు విన్న ద్రౌపది ఉత్తరుడితో, "రాజకుమారా! నాకు బృహన్నల యొక్క పరాక్రమం బాగా తెలుసు. రథం అతడి వశమై ఉంటే కురుసైన్యమే కాదు, ముల్లోకాలూ ఒకేసారిగా మీద పడ్డా, విజయం తప్పదు'' అని అన్నది. బృహన్నల సారథ్యంపై ఉత్తరుడికి ఇంకా అనుమానంగా ఉన్నా అప్పటికి నగరంలో వేరే సారథులు అందుబాటులో లేకపోవడంతో, అతడు బృహన్నలను పిలవటానికి అంగీకరించాడు.

బృహన్నలను పిలుచుకొని రావడానికి ఉత్తర నర్తనశాలకు వెళ్ళింది. గురువును సమీపించగానే ఆమె అణకువతో అతని వద్దకు చేరి, "మా అన్నగారి సారథి ఒక యుద్ధంలో చనిపోగా, తనకు సరిపోయేవాడు దొరక్క వేరే ఎవరినీ సారథిగా నియమించలేదు. ఇప్పుడు కౌరవులు మన ఆలమందలను పట్టుకొన్నారు. వారితో యుద్ధానికి సన్నద్ధుడైన మా అన్న తనకు సారథి లేకపోవడంతో దిగులుగా ఉన్నాడు. సారథ్యంలో నీకు గల నేర్పును గురించి సైరంధ్రి చెప్పింది. అందుకు సంతోషించిన మా అన్న నిన్ను వెంటనే తీసుకొని రమ్మని నన్ను పంపాడు. కనుక మీరు ఉత్తరుడికి సారథ్యం వహించటానికి అంగీకరించి, మమ్మల్ని ఈ ఆపద నుండి కాపాడాలి'' అని కోరింది.

# ఉద్యోగపర్వము

జనమేజయుడు వైశంపాయనుడిని, "ఉత్తరాభిమన్యుల వివాహం తరువాత పాండవులు ఏవిధంగా ప్రవర్తించారు?" అని ప్రశ్నించాడు. దానికి వైశంపాయనుడు ఈవిధంగా చెప్పసాగాడు, "రాజా! అభిమన్యుడి వివాహమైన నాలుగురోజుల తరువాత విరాటరాజు భవనంలో ధర్మరాజు తమ్ముళ్ళు నలుగురూ, వారి కుమారులూ, విరాటుడూ, ద్రుపదుడూ, బలరాముడూ, అభిమన్యుడి వివాహానికి విచ్చేసిన ఇతర రాజులు అందరూ అనేకరీతులుగా కృష్ణుడితోను, ధర్మరాజుతోను మాట్లాడుతున్నారు. అప్పుడు శ్రీకృష్ణుడు పాండవుల మేలు కోరినవాడై వారి మాటలను ఆపి, వారందరికేసి చూసి, "పాండవులు కపట జూదంలో తమ రాజ్యాన్ని కోల్పోయి, ద్యూత నియమం ప్రకారం పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసాన్నీ, పదమూడో ఏట తమను శత్రువులు తెలిసికొనకుండా ఉండటానికి ఎన్నో ఇక్కట్లను అనుభవించి, అజ్ఞాతవాసాన్నీ పూర్తిచేశారు.

ఇక్కడ ఉన్న మీరంతా ధర్మరాజు యొక్క సత్ప్రవర్తన గురించి తెలిసిన వారే. కనుక కౌరవులకూ, పాండవులకూ కూడా మేలు కలిగే విధంగా ఆలోచించి ధర్మమార్గంలో ఒక విధానాన్ని తెలుపండి. అధర్మపద్ధతిలో వస్తే ఇంద్రపదవినైనా తిరస్కరిస్తాడు ధర్మరాజు. అలాగే అతడు తగిన రీతిలో వచ్చినది తనకు తగనిదైనా సంతోషంతో స్వీకరిస్తాడు.

పాండవులకు తండ్రి సొత్తు అయిన రాజ్యాన్నీ, వీరు నాలుగు దిక్కులూ జయించి సంపాదించిన సొత్తునూ కపట జూదంలో మోసగించి, దుర్యోధనుడు అపహరించాడు. ధర్మరాజు యొక్క గొప్పతనాన్ని గ్రహించక, దుర్యోధనాదులు ఇతడిని ఎంత అవమానించినా ఈ ధర్మరాజు వారికి ఎట్టి హానినీ తలపెట్టలేదు. కురురాజ్యం ఈ ఇరుపక్షాలవారూ పంచుకొని అనుభవించదగినది. కనుక

మీరు పై విషయాలన్నింటినీ పరిశీలించి తగిన కర్తవ్యాన్ని బోధించండి. అలాగే నేను కూడా నాకు తెలిసిన విషయాన్ని చెప్తాను. వినండి. పాండవులు తాము జూదంలో చేసికొన్న నియమం ప్రకారం ఈ పదమూడు సంవత్సరాలు శాంతంగానే ఉన్నారు. ఇప్పుడు కౌరవులకు తమ పరాక్రమం చూపాలని భావిస్తున్నారు.

'శత్రువు బలహీనంగా ఉన్నప్పుడే జయించాలి' అనే రాజనీతిని అనుసరించి దుర్యోధనుడు తన మిత్రబృందాన్ని కలుపుకొంటున్నాడు. ఎంతటి బలవంతులైనా, ఇతరుల సహాయం లేకుండా అనంతమైన శత్రువులను ఎదిరించలేరు గదా! కనుక పాండవులకు సహాయం చేసేవారి సమూహం ఇక్కడ చేరుతుంది. ఈ విధంగా పాండవులూ, కౌరవులూ దేవరాక్షసుల వలె యుద్ధానికి సాహసిస్తారు. నా ఈ అభిప్రాయం ఇక్కడి పరిస్థితులని బట్టి చెప్తున్నది. కానీ అక్కడి వారి మనస్సులలో ఏముందో తెలియదు. వారి అభిప్రాయం తెలుసుకోకుండా మనమే కార్యాన్ని నిర్ణయించలేము. కనుక ఈ సమయంలో తగిన వ్యక్తిని కౌరవసభకు పంపి, వారి అభిప్రాయాన్ని తెలుసుకోవాలి. దుర్యోధనుడు వీరికి ఇవ్వవలసిన రాజ్యాన్ని ఇస్తే సరేసరి. లేకుంటే ఏమి చెయ్యాలో అప్పుడు ఆలోచించవచ్చు'' అని కృష్ణుడు వారితో చెప్పాడు.

బలరాముడు శ్రీకృష్ణుడి అభిప్రాయంతో ఏకీభవించాడు. అక్కడ ఉన్న రాజసమూహాన్ని ఉద్దేశించి, "శ్రీకృష్ణుడు చెప్పినది ఇరుపక్షాల వారికీ మేలైనది. జూదంలో తాము కోల్పోయిన సగభాగాన్నే పాండవులు కోరుతున్నారు కనుక, దానిని వారికి ఇచ్చి, తమ సగభాగంతోనే తృప్తి పడటం దుర్యోధనుడికీ మంచిది. దానివలన పాండవులు కూడా కోపాన్ని విడిచిపెట్టి చుట్టరికాన్ని కొనసాగిస్తారు. కాబట్టి ఈ కార్యాన్ని చక్కబరిచే వ్యక్తిని ఆలస్యం చేయకుండా వెంటనే పంపాలి.

దూతగా వెళ్ళే వ్యక్తి చక్కటి మాటతీరు కలిగినవాడై ఉండాలి. అతడు దుర్యోధనుడి మనఃస్థితిని తెలుసుకొని దానికి అనుగుణంగా అతడిని మిక్కిలి నమ్రతతో ప్రార్థించి అడిగితే తప్ప వ్యవహారం చక్కబడదు. ఎందువలనంటే దుర్యోధనుడికి జూదవిద్యలో నేర్పు లేకపోవటం చేత తాను ఆడకుండా, తన

## భీష్ముడు పరశురాముడితో యుద్ధం చేయుట:

మొదట పరశురాముడు నాపై శరవర్షాన్ని కురిపించాడు. అయితే నేను ఆ బాణాలను దారిలోనే అణచివేశాను. ఆ తరువాత అతడు నా శరీరాన్ని బాధించేలా మరిన్ని బాణాలను వేశాడు. నేను కోపంతో పరశురాముడి విల్లును విరిచాను. అతడు మరో విల్లును అందుకొని యుద్ధం కొనసాగించాడు. నేను వాయవ్యాస్త్రం ప్రయోగిస్తే, అతడు గుహ్యకాస్త్రంతో దానిని అడ్డగించాడు. నేను ఆగ్నేయాస్త్రం వేస్తే, అతడు వారుణాస్త్రం ప్రయోగించాడు. ఆ విధంగా మేము ఇరువురం ఇరవై రెండు రోజులు పోరాటం సాగించాం. ఒకరోజు పరశు రాముడు నాపై వాడి బాణాలను ప్రయోగించి, నన్ను స్పృహతప్పేలా చేశాడు. నా రథసారథి తలను ఖండించాడు. నేను మూర్ఛలో ఉండగా, ఎనిమిది మంది బ్రాహ్మణులు, నాతో సమానమైన రూపమూ, వయస్సూ కలవారు, వచ్చి నన్ను లేవదీసి, నా శ్రమను తొలగించి, అక్కడి నుండి మాయమయ్యారు. అప్పుడు నేనే రథాన్ని నడుపుకొంటూ, పరశురాముడితో యుద్ధం కొనసాగించాను.

ఆనాటి రాత్రి నేను దర్భాసనంపై పడుక్కొని దేవతలను, బ్రాహ్మణులను ధ్యానించి, భక్తితో వారికి నమస్కరించి, "పరశురాముడిని జయించలేకున్నాను. నేను అతడిని జయించగలిగితే, మీరు నాకు కనిపించి, నన్ను ఊరడించండి" అని వారిని వేడుకొన్నాను. ఆరోజు పగటివేళ నన్ను మూర్ఛ నుండి లేవదీసిన ఆ ఎనిమిది మంది బ్రాహ్మణులూ తిరిగి నాకు కలలో కనిపించి, "భీష్మా! నువ్వూ, మేమూ ఒక్కటే. నువ్వు భయపడకు. ఇదిగో పరశురాముడిని జయించగల బాణం" అని నాకు అభయమిచ్చి, మోహనాస్త్రాన్ని ప్రసాదించి, తిరిగి వెళ్ళిపోయారు.

ఆ మరునాడు జరిగిన యుద్ధంలో పరశురాముడు తీవ్ర కోపంతో నాపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. నేను కూడా అదే అస్త్రాన్ని అతడిపై ప్రయోగించాను. ఆ రెండు బ్రహ్మాస్త్రాలూ ఒకదానిని ఒకటి ఎదుర్కొని, తమ కాంతితో ఆకాశాన్ని మొత్తం కప్పివేశాయి. అప్పుడు అదే సరియైన సమయమని భావించి, నేను మోహనాస్త్రాన్ని ప్రయోగించబోగా, ఆ సమయంలో సకల చరాచరాలూ ఆక్రోశించాయి. అదే సమయంలో, "వద్దు. మోహనాస్త్రాన్ని ప్రయోగించవద్దు" అంటూ కేకలు పెడుతూ నారదమహర్షి అక్కడకు వచ్చాడు.

నారదమహర్షి నాతో ఇలా అన్నాడు, "గాంగేయా! నువ్వు, నీకు విద్యను నేర్పిన గురువునే అవమానిస్తున్నావు. నీవంటి వాడికి ఇది తగదు. అరుగో! ఆకాశంలో దేవతలు. వారు నీకు నీతులు చెప్పడానికి వచ్చారు'' అంటూ నారదుడు నాకు ఆ ఎనిమిదిమంది బ్రాహ్మణులనూ చూపాడు. తెల్లవారు జామున నాకు స్వప్నంలో కనిపించి, మోహనాస్త్రాన్ని ప్రసాదించిన ఆ ఎనిమిది మంది బ్రాహ్మణులూ నా వద్దకు వచ్చి, "నారదుడు ముల్లోకాలలోనూ పూజింపబడేవాడు. కనుక అతడి మాటలను విను. గురువు విషయంలో క్రూరత్వం పనికిరాదు'' అని చెప్పారు.

నేను వారి మాటలు విని, సమ్మోహనాస్త్ర ప్రయోగాన్ని విరమించాను. ఈ విషయాలను గ్రహించిన పరశురాముడు, తాను అపజయం పొందినట్లుగా భావించాడు. అయినా అతడు నామీద కోపంతో ఉండగా, పరశురాముడి తండ్రియైన జమదగ్ని మహర్షి అక్కడకు వచ్చి, అతడితో శాంతి వచనాలు పలికాడు. జమదగ్ని అతడితో, "రామా! భీష్ముడు అష్ట వసువులలో ఒకడు. యుద్ధంలో ఇతడిని గెలవడం మన తరం కాదు. అయినా బ్రాహ్మణుడికి కోపం, ద్వేషం తగవు. కనుక యుద్ధాన్ని విరమించు. నారాయణసఖుడైన నరుడు, అర్జునుడనే పేరుతో జన్మించి భీష్ముడిని సంహరిస్తాడు. అర్జునుడు తప్ప వేరెవరూ భీష్ముడిని యుద్ధ రంగంలో ఓడించలేరు'' అని చెప్పాడు. అప్పుడు నా తల్లియైన గంగాదేవి కూడా అక్కడికి వచ్చి పరశురాముడి కోపం పోయేలా మాట్లాడింది. అలా వారంతా కలిసి మా ఇరువురి పంతాలనూ మాన్పించారు. అంతట మేమిద్దరం బ్రహ్మాస్త్రాలను ఉపసంహరించాం, యుద్ధం విరమించాం.

నాకు కనిపించిన ఎనిమిదిమంది బ్రాహ్మణుల సలహాపై నేను నా గురువు దగ్గరకు వెళ్ళి, ఆ మహానుభావుడికి సాష్టాంగ నమస్కారం చేశాను. అతడు నన్ను దీవించి, లేవనెత్తి కౌగిలించుకొన్నాడు. ఆపై నాతో, "భీష్మా! నీ శక్తికి, భక్తికి సంతోషించాను'' అని నన్ను ఆశీర్వదించి, అంబతో, "భీష్ముడు నన్ను జయించాడు. నేనింక ఇతడిని ఆదేశించలేను. కనుక నీ దారి నువ్వు చూసుకో'' అని చెప్పాడు. అంబ తన ప్రాప్తమింతేనని భావించి, తపోబలం చేతనే నన్ను వధిస్తానని శపథం చేసి, అక్కడినుండి వెళ్ళిపోయింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Srimadandhra+Mahabharatam+Sarala+Vachanam+Bhagam+3**

* * *